

సాక్షి
బాపట్ల
బుధవారం । 22 । జనవరి । 2025



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్(దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద మంగళవారం 1818 క్యూసెక్కులు విడుదల చేశారు. కొమ్మమూరు కాలువకు 915 క్యూసెక్కులు వదిలారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం మంగళవారం 559.00 అడుగుల వద్ద ఉంది. కుడి కాలువకు 9,500 క్యూసెక్కులు విడుదలవుతోంది.

ఆంజనేయుడికి నాగవల్లీ దళార్చన




ఫిరంగిపురం: మండల కేంద్రంలోని దక్షిణాముఖ ఆంజనేయస్వామికి మంగళవారం పంచామృతాలతో అభిషేకాలు చేసి, నాగవల్లీ దళార్చన నిర్వహించారు. అష్టోత్తర, సహస్రనామాలతో పూజలు చేసి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

న్యూస్‌రీల్

అప్రమత్తంగా ఉండండి

జిల్లా ప్రజలకు కలెక్టర్ సూచన



బాపట్ల: హ్యాకర్లు వివిధ ఫోన్ నంబర్లతో జిల్లా కలెక్టర్ గుర్తింపును దుర్వినియోగం చేస్తున్నారని ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు, జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గుర్తుతెలియని వ్యక్తులు కలెక్టర్ ఫొటో, గుర్తింపు చిహ్నాలతో ఎవరికైనా సందేశాలు వస్తే స్పందించరాదని తెలిపారు. హ్యాకర్లు కలెక్టర్ గుర్తింపును దుర్వినియోగం చేస్తూ 94724297132 నంబర్ నుంచి కొందరికి మెసేజీలు వెళ్లాయన్నారు. ఈ నేపథ్యంలో ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గుర్తు తెలియని వ్యక్తుల నంబర్లతో ఎలాంటి సమాచారం వచ్చినా తక్షణమే పోలీసులకు ఫిర్యాదు చేయాలని కలెక్టర్ సూచించారు.

24న డీ.ఫార్మసీ స్పాట్ అడ్మిషన్లు

గుంటూరుఎడ్యుకేషన్: గుజ్జనగుండ్లలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్‌లో రెండేళ్ల కాల పరిమితి గల డీ.ఫార్మసీ కోర్సులో 2024–25 విద్యాసంవత్సరానికి కౌన్సెలింగ్ తరువాత మిగిలిన సీట్ల భర్తీ కోసం ఈనెల 24న స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ జాస్తి ఉషారాణి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియెట్ బైపీసీ, ఎంపీసీ, ఒకేషనల్ గ్రూపులు పూర్తి చేసిన విద్యార్థినులు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులని తెలిపారు. ఆసక్తి గల విద్యార్థినులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు జిరాక్స్ కాపీలతో రూ.6,300 ఫీజు చెల్లించి అడ్మిషన్ పొందవచ్చునని సూచించారు. ఇతర వివరాలకు 92471 20305, 98480 38769, 99593 24563 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

జీజీహెచ్‌కు రూ.9 లక్షల విరాళం



గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌లో ఇంకుడు గుంతల అభివృద్ధి ద్వారా ఆసుపత్రిలో నీటి కొరతను నివారించేందుకు గుంటూరు వైద్య కళాశాల 1980 బ్యాచ్‌కి చెందిన పూర్వ విద్యార్థులు రూ. 9 లక్షలు విరాళం అందజేశారు. ఆసుపత్రి డెప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ ఉప్పాల శ్రీనివాస్‌కు పూర్వ వైద్య విద్యార్థులు రూ. 9 లక్షల చెక్కును అందజేశారు. విరాళం అందజేసిన పూర్వ వైద్య విద్యార్థులు డాక్టర్ సిద్దాబత్తుని నాగేశ్వరమ్మ, డాక్టర్ శారద, డాక్టర్ రామారావులను డెప్యూటీ సూపరింటెండెంట్ అభినందనించారు.

ఫార్మసిస్టుల ఫైనల్ మెరిట్ లిస్టు విడుదల

గుంటూరు మెడికల్:గుంటూరు ప్రాంతీయ వైద్య ఆరోగ్య శాఖ సంచాలకులు కార్యాలయం పరిధిలో కాంట్రాక్టు పద్ధతిలో ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో పది గ్రేడ్–2 ఫార్మసిస్టు పోస్టులను భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ విడుదల చేసినట్లు ఆర్డీ డాక్టర్ జి.సుచిత్ర తెలిపారు. సదరు నోటిఫికేషన్‌కు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల ఫైనల్ మెరిట్ లిస్టును మంగళవారం విడుదల చేశామన్నారు. ఫైనల్ మెరిట్ లిస్టును, సెలక్షన్ లిస్టును సీఎఫ్ డబ్ల్యూ.ఏపీ.ఎన్ఐసీ.ఇన్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచామన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులు ఈనెల 27న గుంటూరు ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని ఆర్డీ కార్యాలయంలో జరిగే కౌన్సెలింగ్‌కు ఒరిజినల్ సర్టిఫికెట్‌లతో హాజరు కావాలన్నారు.

నేటి సదరమ్ క్యాంప్‌కు అన్ని ఏర్పాట్లు చేయండి

జిల్లా కో–ఆర్డినేటర్ డాక్టర్ మజీదాబేగం

తెనాలిఅర్బన్: తెనాలి జిల్లా వైద్యశాలలో బుధవారం జరగనున్న ప్రత్యేక సదరమ్ క్యాంప్‌కు అన్ని ఏర్పాటుచేయాలని డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ జిల్లా కో–ఆర్డినేటర్ డాక్టర్ మజీదాబేగం ఆదేశించారు. జిల్లా వైద్యశాలను మంగళవారం ఆమె తనిఖీ చేశారు. కమిషనర్ బండి శేషన్న, డీఆర్‌డీఏ పీడీ విజయలక్ష్మి పాల్గొన్నారు.

రహదారులు ఇలా.. రాకపోకలు సాగేదెలా!



గుంతలమయంగా మారిన రావికంపాడు బీటీ రోడ్డు

కొల్లూరు: సంక్రాంతి పండుగలోపు రహదారులపై గుంతలు పూడ్చివేస్తామని కూటమి ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటించింది. పండుగ వెళ్లి వారం రోజులు గడిచినా క్షేత్ర స్థాయిలో రహదారులపై గుంతలు దర్శనమిస్తూనే ఉన్నాయి. రాకపోకలు సాగించేందుకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. 2019 ఎన్నికల సమయంలో రావికంపాడు మీదుగా పెనమర్రు వరకు, బొద్దులూరుపాడు, కొల్లూరు శివారు యాదవపాలెం వెళ్లే రోడ్డుకు అప్పటి మంత్రి, ప్రస్తుత ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు శంకుస్థాపన చేశారు. ఆ తర్వాత పట్టించుకోలేదు. 2024 ఎన్నికల సమయంలో ప్రజల ఇబ్బందులు చూసి వైఎస్సార్ సీపీ వేమూరు నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు తన సొంత ఖర్చులతో మరమ్మతులు చేయించారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం రోడ్ల అభివృద్ధిని పట్టించుకోకపోవడంతో ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.



గులకరాళ్లతో ఛిద్రమైన బొద్దులూరుపాడు రోడ్డు

గీత కార్మికులకు మద్యం షాపులు



- జిల్లాకు 12 దుకాణాలు కేటాయింపు
- మద్యం షాపులు కేటాయింపు తర్వాతే దరఖాస్తులకు ఆహ్వానం
- రెండు రోజుల్లో పూర్తికానున్న తంతు
- ఎక్సైజ్ కమిషనరేట్ నుంచే కేటాయింపులంటున్న అధికారులు
- రేపల్లెలో అధికంగా గీతకార్మికులు
- బాపట్ల, వేమూరుల్లోనూ గౌడ సామాజికవర్గం
- మద్యం షాపుల కోసం ఎదురుచూస్తున్న పచ్చ బినామీలు

సాక్షి ప్రతినిధి,బాపట్ల: జిల్లాలో ఉన్న గీత కార్మికులకు 12 మద్యం దుకాణాలను కేటాయిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులిచ్చింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని జిల్లాలకు కలిపి 335 మద్యం షాపులను కేటాయించిన ప్రభుత్వం జిల్లాకు 12 దుకాణాలను కేటాయించింది. జిల్లాలో బాపట్ల, రేపల్లె, వేమూరు, నగరం, చీరాల, పర్చూరు, అద్దంకి ఎక్సైజ్ పోలీసు స్టేషన్లు ఉండగా వాటి పరిధిలో ఎన్ని దుకాణాలు చొప్పున కేటాయించనున్నారో ఇంకా వెల్లడించలేదు. ఎక్సైజ్ కమిషనరేట్ నుంచే దుకాణాల కేటాయింపు జాబితా విడుదల కానున్నట్లు సమాచారం. గీతకార్మికుల జనాభా ప్రాతిపదికన మద్యం దుకాణాలు కేటాయించనున్నట్లు ప్రచారం వుంది. వాస్తవానికి రేపల్లె నియోజకవర్గంలో జిల్లాలోనే అత్యధికంగా 43 వేల గౌడ ఓటర్లు ఉండగా 60 వేలకు పైగా జనాభా ఉన్నారు. ఆ తర్వాత బాపట్ల, వేమూరు నియోజకవర్గాల్లోనూ ఆ సామాజికవర్గం అధికంగా వుంది. జిల్లాలోనూ అక్కడక్కడా ఆ సామాజికవర్గం వారు ఉన్నారు. ఈ పరిస్థితిలో మద్యంషాపుల కేటాయింపు గీత కార్మికుల జనాభా ప్రాతిపదికన ఇస్తారా, లేక ఎక్సైజ్ పోలీసుస్టేషన్ల వారీగా ఇస్తారా? అనేది పేర్కొనలేదు. ఒకవేళ అలా కాకుండా ఇప్పటికే ఆయా ప్రాంతాల్లో గతంలో కేటాయించిన మద్యం దుకాణాలను సైతం పరిగణలోకి తీసుకొని గీత కార్మికుల దుకాణాలు కేటాయిస్తారా? అనే విషయంపై ఇప్పటికీ స్పష్టతలేదు. ఎక్సైజ్ కమిషనరేట్ నుంచే మద్యం దుకాణాల కేటాయింపు ఉంటుందని ఎక్సైజ్ అధికారులు చెబుతున్నారు. మొత్తంగా గీత కార్మికులకు జిల్లాలో 12 మద్యం దుకాణాలు కేటాయించినా అవి ఏప్రాంతంలో ఇస్తారు అనే దానిపై స్పష్టత రావడానికి మరికొంత సమయంపట్టే అవకాశముంది.

బినామీలు సిద్ధం

గీత కార్మికుల మద్యం దుకాణాలు కొల్లగొట్టేందుకు పచ్చబినామీలు సిద్ధంగా కూర్చున్నారు. ప్రభుత్వం అక్టోబర్‌లో మద్యం దుకాణాలు కేటాయించే సమయంలోనే 10 శాతం దుకాణాలు గీత కార్మికులకు కేటాయించనున్నట్లు ప్రకటించినా మద్యం దుకాణాల ఏర్పాటు నాటికి గీత కార్మికులకు ఇస్తామన్న దుకాణాల కేటాయింపు ఇప్పటివరకు జరగలేదు. ఎట్టకేలకు 3 నెలల తర్వాత గీతకార్మికులకు దుకాణాలను కేటాయిస్తూ జీవో ఇచ్చింది. అయితే గీత కార్మికుల పేరుతో వచ్చే దుకాణాలను కొట్టేసేందుకు పచ్చ బినామీలు ఇప్పటికే సర్వం సిద్ధం చేసుకున్నారు. మద్యం దుకాణాల కేటాయింపు అనంతరం తమ మనుషుల పేరున తంతు పూర్తిచేసి వేరెవరినీ దుకాణాల కోసం పోటీకి రాకుండా అడ్డుకునేందుకు అధికారాన్ని అడ్డుపెట్టి అన్ని రకాల ప్రయత్నాలు సాగించనున్నారు.

భూసేకరణ త్వరితగతిన పూర్తి చేస్తాం

జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి

బాపట్ల: జిల్లాలో వాడరేవు–పిడుగురాళ్ల 167–ఏ జాతీయ రహదారి, బెంగళూరు–విజయవాడ జాతీయ రహదారి 544–జీ నిర్మాణానికి అవసరమైన భూసేకరణ త్వరితగతిన పూర్తి చేస్తామని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి పేర్కొన్నారు. మంగళవారం అమరావతి సచివాలయం నుంచి జాతీయ రహదారుల నిర్మాణాలకు అవసరమైన భూసేకరణపై జిల్లా కలెక్టర్‌తో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ రెండు జాతీయ రహదారులకు సంబంధించి మిగిలిన 3.5 కిలోమీటర్ల రహదారులకు భూసేకరణ అవార్డు పాస్ చేసినట్లు తెలిపారు. అవార్డు పాస్ చేసిన భూములకు సంబంధించి నష్టపరిహారం 10 రోజుల్లో రైతులకు చెల్లిస్తామని తెలిపారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ప్రఖర్ జైన్ జిల్లా రెవెన్యూ అధికారి జి.గంగాధర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నిజాంపట్నం హార్బర్ వద్ద ఎండు చేపల ఫ్యాక్టరీ

నిజాంపట్నం హార్బర్ అభివద్ధిలో భాగంగా ఎండు చేపల ఫ్యాక్టరీ ఏర్పాటుకు సమగ్ర ప్రణాళిక రూపొందించాలని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. జిల్లాస్థాయి కమిటీ సమావేశం మంగళవారం స్థానిక కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. స్ఫూర్తి ప్రాజెక్టు ద్వారా జిల్లాలో ఎండు చేపల ఫ్యాక్టరీ ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని తెలిపారు. మారిటైం బోర్డు పరిధిలోనే హార్బర్‌కు అనుసంధానంగా ఈ ప్రాజెక్టు ఏర్పాటు చేస్తామన్నారు. తీర ప్రాంతాల కారిడార్‌లో ఎండు చేపల ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తే 500 మంది పొదుపు సంఘాలలోని మహిళా సభ్యులు జీవనోపాధి పొందుతారన్నారు. రెండు ఎకరాల భూమిని కేటాయించాలని అటవీ శాఖ అధికారులను ఆయన ఆదేశించారు. ఆ ప్రాంతంలో మడ అడవులు ఉన్నందున ప్రభుత్వానికి నివేదిక పంపాలని చెప్పారు. నిజాంపట్నం హార్బర్ ఫేజ్–2 కింద జరుగుతున్న అభివృద్ధి పనులకు మరికొంత భూమి కేటాయించాలని ఇప్పటికే మారిటైం బోర్డ్ ప్రతిపాదించిందన్నారు. స్ఫూర్తి ప్రాజెక్టు ద్వారా 90 శాతం రాయితీపై రూ.ఐదు కోట్ల నిధులను కేంద్ర ప్రభుత్వం కేటాయిస్తుందన్నారు. డీఆర్‌డీఏ పీడీ పద్మ, మత్స్య శాఖ సహాయ సంచాలకులు కృష్ణకిషోర్, అటవీ శాఖ అధికారి భీమయ్య, మారిటైం బోర్డు అధికా రులు, అనుబంధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పంగులూరులో ఇండోర్ స్టేడియం

- ప్రతిపాదనలు పంపాలన్న ఏపీ స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్ రవినాయుడు
- పంగులూరు ఖోఖో కోచింగ్ క్యాంపు సందర్శన
- స్పోర్ట్స్ కోటా 2 నుంచి 3 శాతానికి పెంపు
- క్రీడా ప్రాంగణాల అభివృద్ధికి సీఎస్ఆర్ నిధులు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న రవినాయుడు

జె.పంగులూరు: పంగులూరులో ఇండోర్ స్టేడియం ఏర్పాటు కోసం ఖేల్ ఇండియా ప్రమాణాలకు అనుగుణంగా ప్రతిపాదనలు సిద్ధం చేసి కలెక్టర్‌కు పంపించాలని ఏపీ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ అనిమిని రవినాయుడు సూచించారు. ఉత్తరాఖండ్ రాష్ట్రంలో ఈ నెల 28 నుంచి ఫిబ్రవరి 14వ తేదీ వరకు జరగనున్న 38వ జాతీయ పోటీల్లో ఏపీ క్రీడాకారులు సత్తా చాటాలని ఆకాంక్షించారు. స్థానిక పంగులూరు జూనియర్ కళాశాలలో ఎస్ఆర్ఆర్ ఖోఖో అకాడమీ ఆధ్వర్యంలో రాష్ట్ర జట్టుకు నిర్వహిస్తున్న కోచింగ్ క్యాంపును మంగళవారం పరిశీలించారు. కార్యక్రమానికి ముందుగా జాతీయ స్థాయి క్రీడల్లో రాష్ట్ర నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ఖోఖో క్రీడాకారులను ఆయన పరిచయం చేసుకుకొని, అభినందించారు. ఏపీని క్రీడా రంగంలో అగ్రస్థానంలో నిలబెట్టాలన్నారు. క్రీడాకారుల భవిష్యత్తే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం నూతన క్రీడా పాలసీ తీసుకొచ్చిందని చెప్పారు. ప్రభుత్వ ఉద్యోగ కల్పనలో స్పోర్ట్స్ కోటాను 2 నుంచి 3 శాతం పెంచిందని తెలిపారు. క్రీడా ప్రోత్సాహకాలు భారీగా పెంచామని తెలిపారు. ఉమ్మడి ప్రకాశం జిల్లా ఖోఖో క్రీడకు పెట్టింది పేరని జిల్లా నుంచి మరింత మంది అంతర్జాతీయ క్రీడాకారులు తయారు కావాలని ఆయన పిలుపునిచ్చారు.

స్పాన్సర్లు.. క్రీడాకారులను ప్రోత్సహించాలి

కార్యక్రమానికి ముందు అధికారులతో జరిగిన సమావేశంలో రవినాయుడు .. స్పోర్ట్ అథారిటీ అధికారుల నుంచి బాపట్ల జిల్లా సమాచారం అడిగి తెలుసుకున్నారు. ముందుగా అద్దంకి డిగ్రీ కళాశాల సమీపంలో శాప్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇండోర్ కోర్టుపై ఆరా తీశారు. పట్టణానికి 5 కిలో మీటర్లు దూరంగా ఉండటం వలన అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని తెలిపారు. క్రీడాకారులకు ప్రభుత్వ ప్రోత్సాహంతోపాటు, క్రీడా అభివృద్ధికి స్పాన్సర్లు ముందుకు రావాలని అన్నారు.

విద్యార్థులు క్రీడల వైపు మొగ్గు చూపాలి

అనంతరం రాష్ట్ర ఖోఖో అసోసియేషన్ ఛైర్మన్ బాచిన చెంచుగరటయ్య మాట్లాడుతూ పాఠశాల స్థాయినుంచే విద్యార్థులు క్రీడల్లో రాణించే విధంగా విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కృషి చేస్తున్నారన్నారు. యువత డ్రగ్స్, గంజాయికి బానిసలయ్యారని, వాటికి దూరంగా ఉండాలంటే విద్యార్థులను క్రీడల వైపు మొగ్గు చూపాలన్నారు. అలాగే క్రీడల అభివృద్ధికి శాప్ కృషి అభినందనియం అని తెలిపారు.

ఖోఖో క్రీడాకారునికి అభినందనలు


ఈ నెల 19వ తేదీన ఢిల్లీలో జరిగిన ఖోఖో వరల్డ్ కప్ చాంపియన్ షిప్ విజేతగా నిలిచిన భారత జట్టులో ఏపీ నుంచి ప్రాతినిధ్యం వహించిన పంగులూరు ఖోఖో క్రీడాకారుడు పి.శివారెడ్డిని శాప్ ఛైర్మన్ రవినాయుడు అభినందించారు. డీఎస్‌డీఓ పాల్ కుమార్, జిల్లా కోచ్‌లు, రాష్ట్ర మాజీ స్కూల్ గేమ్స్ సెక్రటరీ శీనయ్య, మల్లవరం పెద్దలు బాలిన సుబ్బారావు, కర్రి సుబ్బారావు, రావూరి రమేష్, జెడ్పీటీసీ రాయిణి వెంకటసుబ్బారావు, వీరరాఘవయ్య, కె.హనుమంతరావు పాల్గొన్నారు.

అనుకున్నదొక్కటి..అయినది ఒకటి !

- ఫోర్జరీ సంతకాలతో నకిలీ ఎండార్స్‌మెంట్ ధ్రువీకరణ పత్రం సృష్టి
- కోట్ల రూపాయల స్థలం రిజిస్ట్రేషన్
- హైకోర్టు ఆదేశాలతో రెవెన్యూ, పోలీసుల విచారణ
- ఆందోళనలో టీడీపీ నాయకులు



మార్టూరు తహసీల్దార్ కార్యాలయం



నకిలీ ఎండార్స్‌మెంట్ పత్రం

మార్టూరు: రెవెన్యూ అధికారుల సంతకాలు ఫోర్జరీ చేసి నకిలీ ధ్రువీకరణ పత్రం సృష్టించారు. కోట్ల రూపాయల విలువైన స్థలం రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. ఇదంతా గుట్టుచప్పుడు కాకుండా జరిగిపోయింది. కానీ చివరకు కథ అడ్డం తిరిగింది. హైకోర్టు ఆదేశాలతో అధికారులు విచారణ చేపట్టారు. దీంతో టీడీపీ నాయకులు అడ్డంగా దొరికిపోయారు. ఈ సంఘటన ప్రస్తుతం మార్టూరులో చర్చనీయాంశంగా మారింది. విశ్వసనీయ సమాచారం మేరకు.. స్థానిక కొణిదెన రోడ్డులోని 53 సెంట్ల భూమి విషయమై దాయాదుల మధ్య వివాదం నడుస్తోంది. బహిరంగ మార్కెట్‌లో ఆ భూమి విలువ కోట్ల రూపాయలలో ఉంటుంది. ఈ భూమిని కొనుగోలు చేసేందుకు మార్టూరుకు చెందిన ఓ ప్రైవేటు కళాశాల ప్రిన్సిపాల్, జొన్నతాళి గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు పథక రచన చేశారు. తమతోపాటు మరో పదిమందిని కలుపుకుని సెంటు రూ.12 లక్షల చొప్పున సుమారు రూ.7 కోట్లకు కొనుగోలు చేయడం కోసం భూయజమానులు అందరితోనూ ఒప్పందం చేసుకొని అగ్రిమెంట్ చేయించుకున్నారు. అగ్రిమెంట్ పూర్తి కాగానే ప్లాట్లుగా వేసి విక్రయించడానికి రంగం సిద్ధం చేసుకున్నారు. ఈ భూమి రిజిస్ట్రేషన్ కోసం సదరు భూమి పలానా వారికే చెందినదని స్థానిక తహసీల్దార్ ఎండార్స్‌మెంట్ చేస్తూ ధ్రువీకరణ పత్రం ఇవ్వాల్సి ఉంది. వివాదాస్పద భూమి కావటంతో అధికారులు అందుకు సహకరించలేదు. దీంతో నకిలీ ధ్రువపత్రాలను సృష్టించడంలో దిట్ట అయిన మండలంలోని కోలలపూడి గ్రామానికి చెందిన ఓ 'సత్య'వంతుడుతో బేరం కుదుర్చుకొని 19–09–2023న అప్పటి మార్టూరు తహసీల్దార్ సంతకం ఫోర్జరీ చేసి సర్వే నంబర్ 582 / సి2ఏలోని 53 సెంట్ల భూమిలో సగభాగమైన 26.5 సెంట్లకు మొదటి విడతగా వివాదంలో ఉన్న దాయాదుల్లోని ఓ వ్యక్తి పేరిట ఎండార్స్‌మెంట్ ఇచ్చినట్లుగా నకిలీ ధ్రువపత్రం సృష్టించి వీరికి ఇచ్చాడు. దీని ఆధారంగా అందులోని కొంత భూమిని మొదట నరసరావుపేట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. మార్టూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో మిగిలిన భూమిని కొనుగోలుదారులు రిజిస్ట్రేషన్ చేయించుకోవడం గమనార్హం. దాయాదుల్లోని ఓ వ్యక్తితో ఈ కొనుగోలుదారులకు విభేదాలు తలెత్తడంతో అడ్డం తిరిగి తన వాటా భూమిని రిజిస్ట్రేషన్ చేయలేదు. అతను సమాచార హక్కు చట్టం ద్వారా స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ధ్రువీకరణ పత్రం విషయమై ప్రశ్నించగా అది తమ కార్యాలయం నుంచి జారీ చేసినది కాదని, ప్రస్తుత రెవెన్యూ అధికారులు ఇచ్చిన ధ్రువీకరణ పత్రంతో హైకోర్టులో 11–09–2024వ తేదీ పిటిషన్ దాఖలు చేశారు. అప్పటికే పిటీషనర్ సమర్పించిన ఎండార పత్రాన్ని పరిశీలించిన హైకోర్టు 12–09–2024వ తేదీ దీనిపై పూర్వపరాలను పరిశీలించి నివేదిక ఇవ్వాలని మార్టూరు పోలీస్‌స్టేషన్ అధికారిని ఆదేశించింది. విచారణ జరిపిన స్థానిక పోలీసులు 7–11–2024న హైకోర్టుకు నివేదికను సీల్డు కవర్ ద్వారా అందజేశారు. దీనిపై ఈనెల 28వ తేదీ హైకోర్టు విచారణ చేస్తుండటం గమనార్హం. ఎండార్స్‌మెంట్ నకిలీదని తన సంతకాన్ని ఫోర్జరీ చేశారని అప్పటి తహసీల్దార్ పోలీసులకు తెలిపిన విషయం తెలుసుకున్న ఫోర్జరీ కింగ్ 'సత్య'వంతుడు తెరవెనుక తన ప్రయత్నాలను ముమ్మరం చేయడం విశేషం. మార్టూరులో తనకున్న విలువైన ఇంటి స్థలాన్ని ఇతరుల వద్ద తాకట్టు పెట్టి సుమారు రూ.25 లక్షలు చేతిలో ఉంచుకొని మొదట స్థానిక రెవెన్యూ కార్యాలయంలోని ఓ వీఆర్‌ఓ ని 'ప్రసన్నం' చేసుకునే ప్రయత్నం చేయగా అందుకు అతను అంగీకరించలేదు.

ఎండార్స్‌మెంట్ కాపీ జారీ చేయలేదు

మార్టూరు గ్రామ సర్వేనంబర్ 582 / సి2ఏ లోని భూమికి సంబంధించిన ఎండార్స్‌మెంట్ కాపీ మా కార్యాలయం నుంచి జారీ చేయలేదు.

– టీ ప్రశాంతి, తహసీల్దార్, మార్టూరు

హైకోర్టు అడిగిన వివరాలు అందజేశాం

మార్టూరు సర్వేనంబర్ 582/ సి2 ఏ భూమికి సంబంధించి వివరాలను హైకోర్టు అడిగిన మాట వాస్తవమే. కోర్టు అడిగిన వివరాలను అందజేశాం.

– నాగలక్ష్మి, డిప్యూటీ తహసీల్దార్

రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు

జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ ప్రఖర్ జైన్

బాపట్ల: రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ప్రఖర్ జైన్ పేర్కొన్నారు. స్థానిక కలెక్టరేట్‌లో జిల్లా రోడ్ సేఫ్టీ కమిటీ సమావేశం మంగళవారం నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ప్రమాదాల నివారణకు పలు సూచనలు చేశారు. 2023లో జిల్లా వ్యాప్తంగా 567 ప్రమాదాలు జరగగా, 2024లో 522 జరిగాయని తెలిపారు. ఈ సంఖ్య జీరోకు తీసుకువచ్చేందుకు అందరూ కృషి చేయాలని అన్నారు. గుర్తించిన బ్లాక్ స్పాట్‌లలో వెంటనే నివారణ చర్యలు తీసుకోవాలని నేషనల్ హైవే, ఆర్ అండ్ బీ, మునిసిపల్ అధికారులను ఆదేశించారు. క్షతగాత్రులకు సహాయపడే వారికి ఎటువంటి ఇబ్బందులు కలిగించవద్దని మెడికల్, పోలీస్ అధికారులకు సూచించారు. ప్రమాదాలలో గాయపడిన క్షతగాత్రులకు సహాయపడే వారికి రూ.5,000 ఆర్థిక సహాయం అందిస్తామని తెలిపారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ విఠలేశ్వర్, జిల్లా రవాణాశాఖ అధికారి టి.కె.పరంధామరెడ్డి, డీఎంహెచ్ఓ ఎస్.విజయమ్మ, బాపట్ల, చీరాల, రేపల్లె డీఎస్పీలు, బాపట్ల, చీరాల, అద్దంకి మునిసిపల్ కమిషనర్లు, నేషనల్ హైవే అధికారులు, ఆర్ అండ్ బీ అధికారులు, ఆర్టీసీ డిపో మేనేజర్లు పాల్గొన్నారు.

వైరల్ ఫీవర్లపై అప్రమత్తత ముఖ్యం

సత్తెనపల్లి: శీతాకాలంలో వైరల్ ఫీవర్లతో అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బి.రవి అన్నారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లిలోని వ్యవసాయ మార్కెట్ యార్డు అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం సత్తెనపల్లి డివిజన్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు, సూపర్‌వైజర్లతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ.. చలి తీవ్రత పెరిగి అనేక వ్యాధులు విజృంభిస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. వాతావరణం చల్లగా ఉండటంతో హానికారక వైరస్ శరీరంలోకి ప్రవేశించి వ్యాధులకు కారణమవుతుందని చెప్పారు. ఈ కాలంలో సాధారణంగా జలుబు, దగ్గు, జ్వరం, గొంతునొప్పి, ఫ్లూ వంటి వ్యాధులు సంభవిస్తాయని పేర్కొన్నారు. వీటితోపాటు పలు రకాల అంటు వ్యాధులు, కంటి వ్యాధులే కాకుండా ఎలర్జీలు, ఆస్తమా, సీవోడీపీ, అలర్జిక్ బ్రాంకైటిస్, నిమోనియా వంటి శ్వాసకోశ వ్యాధుల తీవ్రత పెరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ కనీస జాగ్రత్తలు పాటించడం ద్వారానే వీటి నివారణ సాధ్యమవుతుందని చెప్పారు. డివిజన్ పరిధిలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పనితీరు మెరుగుపడాలని ఆదేశించారు.

చెత్త నుంచి సంపద సృష్టిస్తున్న రెండో రాష్ట్రం ఏపీ

విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్

సాక్షి, అమరావతి: చెత్త నుంచి విద్యుత్ ఉత్పత్తి చేస్తున్న రెండో రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ తెలిపారు. గుంటూరులోని జిందాల్ వేస్ట్ టూ ఎనర్జీ ప్లాంట్‌ను మంత్రి మంగళవారం సందర్శించారు. చెత్తను ప్రాసెసింగ్ చేసి, విద్యుత్ ఉత్పత్తి చేసే ప్రక్రియను అక్కడి అధికారులు మంత్రికి వివరించారు. మంత్రి గొట్టిపాటి మాట్లాడుతూ.. దేశ వ్యాప్తంగా దేశ రాజధాని ఢిల్లీ తరువాత ఇలాంటి ప్లాంట్లు కేవలం ఏపీలోనే ఉన్నాయని వెల్లడించారు. విజయవాడ, గుంటూరు పరిసర ప్రాంతాల్లోని మూడు కార్పొరేషన్లు, ఐదు మున్సిపాలిటీల నుంచి చెత్తను సేకరించి శుభ్రం చేయడంతోపాటు గంటకు 15 మెగావాట్ల మేర విద్యుత్ ఉత్పత్తి జరుగుతోందని వివరించారు. పర్యావరణ హితం కోసం ఇలాంటి ప్లాంట్లు మరిన్ని స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా రాష్ట్రానికి రావాలన్నారు. కార్యక్రమంలో జిందాల్ ప్రాజెక్ట్ ప్రెసిడెంట్ ఎంవీ చారి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బాపట్ల జిల్లా వాసికి జాతీయ రంగస్థల పురస్కారం



బాపట్ల: బాపట్ల జిల్లా ఆదర్శనగర్‌కు చెందిన సంగాని ఏడుకొండలుకు జాతీయ రంగస్థల పురస్కారం దక్కింది. తెలుగు సంస్కృతి-సాహిత్య సేవా ట్రస్టు, ఆంధ్రప్రదేశ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ జాతీయ స్థాయి మొదటి వార్షికోత్సవం విజయవాడలో జరిగింది. వార్షికోత్సవంలో బాలచంద్రుడు ఏకపాత్రను ప్రదర్శించిన సంగాని ఏడుకొండలుకు స్వర్ణకంకణంతోపాటు జాతీయ రంగస్థల పురస్కారం లభించింది. 36ఏళ్లుగా పౌరాణిక, నాటకం ప్రదర్శించి ఉత్తమ ప్రతిభ కనపరిచిన సంగానికి పురస్కారం రావటంపై పలువురు అభినందనలు తెలిపారు. మరోన్నె పురస్కారాలు సొంతం చేసుకోవాలని బాపట్ల నవ్యనాటక కళాసమితి అధ్యక్షులు సోమరాజు శ్రీను కోరుకున్నారు.

ఎక్సైజ్ చట్టాలను అతిక్రమిస్తే చర్యలు

జిల్లా అసిస్టెంట్ సూపరింటెండెంట్ బి వెంకటేశ్వర్లు



నగరం: ఎక్సైజ్ చట్టాలను విధిగా పాటించాలని లేనిపక్షంలో కఠిన చర్యలు తప్పవని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ జిల్లా అసిస్టెంట్ సూపరింటెండెంట్ బి వెంకటేశ్వర్లు హెచ్చరించారు. స్థానిక ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌ను మంగళవారం ఆయన తనిఖీ చేసి పలు రికార్డులు పరిశీలించారు. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఎక్సైజ్ చట్టాలకు అనుగుణంగా మద్యం షాపులు నడపాలన్నారు. ఎమ్మార్పీకే మద్యం విక్రయాలు జరపాలన్నారు. బెల్ట్‌షాపులకు మద్యం సరఫరా చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సాక్షి దినపత్రికలో ప్రచురితమైన ప్రజల వద్దకే మద్యం కథనంపైన ఆయన ఆరా తీశారు. సమావేశంలో సీఐ మారుతి శ్రీరామ్‌ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

రేపల్లె రూరల్: రేపల్లె ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయాన్ని మంగళవారం సాయంత్రం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ జిల్లా అసిస్టెంట్ సూపరింటెండెంట్ బి.వెంకటేశ్వర్లు సందర్శించారు. కార్యాలయంలోని రికార్డులను పరిశీలించి కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. గ్రామాలలో బెల్టు షాపుల నిర్వహణ లేకుండా నిరంతరం పర్యవేక్షించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. మూడవ విడత చలానా వివరాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఆయన వెంట సీఐ దివాకర్, సిబ్బంది ఉన్నారు.

పశువులకు సకాలంలో వైద్యం చేయించాలి

పశు సంవర్ధక శాఖ జిల్లా అధికారి వేణుగోపాల్



దూడలకు నట్టల నివారణ మందు పెడుతున్న జిల్లా అధికారి వేణుగోపాల్

కర్లపాలెం: పశువులలో వచ్చే వ్యాధులకు సకాలంలో వైద్యం చేయించాలని పశు సంవర్ధక శాఖ జిల్లా అధికారి డాక్టర్ వేణుగోపాల్, జిల్లా ప్రత్యేక అధికారి డాక్టర్ షనీలా అన్నారు. పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యాన కర్లపాలెం మండలం నల్లమోతువారిపాలెంలో మంగళవారం పశు వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని పశు సంవర్ధక శాఖ జిల్లా అధికారి డాక్టర్ వేణుగోపాల్, జిల్లా ప్రత్యేక అధికారి డాక్టర్ షనీలా ఆకస్మికంగా సందర్శించారు. వేణుగోపాల్ మాట్లాడుతూ మేలు జాతి పశువులను పెంచుకోవటంతోపాటు పోషక విలువలు ఉన్న దాణా పెట్టాలని రైతులకు సూచించారు. పశువులలో వచ్చే గాలికుంటు వ్యాధులకు లేగదూడలలో వచ్చే నట్టల నివారణకు సకాలంలో మందు పెట్టాలని అన్నారు. గ్రామాలలో ఏర్పాటు చేస్తున్న వైద్య శిబిరాలను వినియోగించుకుని తమ పశువులకు నాణ్యమైన వైద్య సేవలు పొందాలని అన్నారు. కార్యక్రమంలో మండల పశు వైద్యాధికారి రేచల్ దివ్య, సహాయ సంచాలకులు డాక్టర్ శంకర్‌రావు, టీడీపీ నాయకులు ఎం.చిన్న, ఎం.శ్రీనివాసరావు, జి.శ్రీనివాసరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పీహెచ్‌సీ గత వైద్యాధికారిపై తుది విచారణ



విచారణాధికారికి తన వాంగూల్మాన్ని అందజేస్తున్న టీడీపీ మండల కన్వీనర్ మురళీకృష్ణ

కొల్లూరు: మహిళా వైద్య సిబ్బందిని లైంగికంగా వేధించారన్న ఆరోపణలపై పీహెచ్‌సీ గత వైద్యాధికారిపై వైద్యశాఖ ఉన్నతాధికారులు తుది విచారణ చేపట్టారు. కొల్లూరు పీహెచ్‌సీలో వైద్యాధికారిగా గతేడాది పనిచేసిన డి.రవిబాబు మహిళా ఉద్యోగులను లైంగికంగా వేధింపులకు గురిచేశారన్న ఆరోపణలతో గతంలో మహిళా సిబ్బంది పలువురు రెండు పర్యాయాలు జిల్లా వైద్యాధికారులకు రాత పూర్వక ఫిర్యాదులు చేశారు. దీనిపై అప్పట్లో రెండు దఫాలుగా వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బంది పీహెచ్‌సీలో సిబ్బందితోపాటు, రవిబాబును ప్రాథమికంగా విచారించి వారి వివరణలను సేకరించారు.

గతేడాది నిర్వహించిన విచారణ అనంతరం ఆరోపణలు ఎదుర్కొంటున్న వైద్యాధికారిని విధుల నుంచి తొలగించారు. ఈఅంశంపై తుది విచారణ మంగళవారం వైద్యశాఖ జిల్లా పరిశోధనాధికారి ఎ.శ్రావణ్‌బాబు, జిల్లా స్థాయి వైద్య, ఆరోగ్య శాఖాధికారి ఆర్ఎల్. నరసింహారావుతో కలసి విచారణ జరిపారు. పీహెచ్‌సీలో అప్పట్లో వైద్యాధికారి తమను లైంగికంగా వేధిస్తున్నట్లు ఫిర్యాదులు చేసిన మహిళా సిబ్బందితోపాటు, వైద్యశాలలో పనిచేస్తున్న ఇతర మహిళా ఉద్యోగులను సైతం విచారణ బృందం క్షుణంగా విచారించి వారి వద్ద నుంచి వివరాలు సేకరించారు. వైద్యాధికారి మహిళా సిబ్బందిని లైంగికంగా వేధింపులకు గురిచేస్తున్న విషయంలో అప్పట్లో అధికారులకు ఫిర్యాదు చేసిన టీడీపీ మండల కన్వీనర్ మైనేని మురళీకృష్ణ సైతం విచారణకు హాజరై వైద్యాధికారిపై రాతపూర్వకంగా తన ఫిర్యాదును అందజేశారు. విచారణకు సంబంధించిన పూర్తి నివేదికను ఉన్నతాధికారులకు అందజేయనున్నట్లు విచారణాధికారులు వెల్లడించారు.

అక్రమ నిర్మాణంపై దేవదాయ అధికారుల తనిఖీ



భవనాన్ని పరిశీలిస్తున్న దేవాదాయశాఖ సహాయ కమిషనరు జి.మాధవి, ఇన్‌స్పెక్టర్ ఎస్.శారదదేవి

కొల్లిపర: కొల్లిపరలో అనుమతుల్లేకుండా జరుగుతున్న భవన నిర్మాణాన్ని దేవదాయ శాఖ అధికారులు మంగళవారం తనిఖీ చేశారు. గ్రామానికి చెందిన బొంతు జగదీశ్వరరెడ్డి నిర్మిస్తున్న మూడంతస్తుల భవనం స్థలం శ్రీపోతురాజుస్వామి దేవాలయానికి చెందిందని, అక్కడ భవన నిర్మాణానికి ఎలాంటి అనుమతులు లేవంటూ కుంచెల వెంకటరామిరెడ్డి ఏపీసీఆర్‌డీఏ, తెనాలి జోనల్ కార్యాలయానికి, జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదులందాయి. దీనిపై విచారణకు దేవదాయశాఖ సహాయ కమిషనరు జి.మాధవి, తెనాలి దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ ఎస్.శారదదేవి, ఈవో అవుతు శ్రీనివాసరెడ్డి గ్రామానికి వచ్చారు. పంచాయతీ కార్యదర్శి అలకనంద, వీఆర్వో భాస్కర్‌తో కలిసి సంబంధిత ప్రదేశాన్ని, నిర్మాణంలో ఉన్న భవనాన్ని పరిశీలించారు. ఇప్పటికే గ్రామపంచాయతీ, రెవెన్యూ అధికారులు బొంతు జగదీశ్వరరెడ్డికి నోటీసులు ఇచ్చి భవన నిర్మాణాన్ని నిలుపుదల చేయించినట్టు తెలుసుకున్నారు అనంతరం ఆలయ కమిటీ పెద్దలు, స్థానిక నివేశనదారులతో మాట్లాడారు. దేవాలయ రికార్డులను పరిశీలించారు. సంబంధిత భూమి అంతా గ్రామకంఠంలో ఉందని నిర్ధారించుకున్నారు. అనంతరం దేవాదాయశాఖ సహాయ కమిషనరు జి.మాధవి మాట్లాడుతూ కొల్లిపరలోని శ్రీపోతురాజుస్వామి గుడి దేవదాయశాఖ పరిధిలో లేదన్నారు. ఆలయానికి చెందిన స్థలంగా పేర్కొంటున్న గ్రామకంఠంలో దాదాపు 50 మంది గ్రామస్తులు నివాసగృహాలను నిర్మించుకుని ఏళ్లుగా నివసిస్తున్నారని వివరించారు. వీటికి ఎలాంటి ధ్రువీకరణ పత్రాలు లేవన్నారు. ఆలయ కమిటీ పెద్దలు, అక్కడ నివసిస్తున్న గ్రామస్తులు కలసి మాట్లాడుకుని పదిరోజుల్లో తగిన నిర్ణయం తీసుకుని నివేదించాలని సూచించారు. లేకుంటే నివాసాలపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అధికారుల వెంట తూములూరు దేవాదాయశాఖ ఈవో ప్రసాద్, దేవాలయం కమిటీ సభ్యులు ఉన్నారు.

బిక్కుబిక్కుమంటున్న కేజీబీవీ విద్యార్థినులు

ప్రాంగణం వద్ద కొండచిలువ, పాముల సంచారంతో బెంబేలు

సత్తెనపల్లి: పట్టణంలోని రైల్వే స్టేషన్ రోడ్‌లో ఉన్న కస్తూర్బా గాంధీ విద్యాలయం (కేజీబీవీ) చుట్టూ బయట వైపు అపరిశుభ్ర వాతావరణం నెలకొంది. దీంతో కొండచిలువ, రెండు పాములు మంగళవారం సంచరించాయి. పాఠశాల ప్రహరీ సమీపంలో అవి కనిపించడంతో విద్యార్థినులు బెంబేలెత్తి బయటకు పరుగులు తీశారు. పరిసరాలు అధ్వానంగా ఉన్నప్పటికీ పాలకులు, అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రమాదం పొంచి ఉంది. ఇప్పటికైనా స్పందించి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచడంతోపాటు ప్రహరీ నిర్మించాలని పలువురు విద్యార్థినుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఉమెన్ ప్రొటెక్షన్ సెల్ ఏర్పాటు చేయాలి

ఏపీ ఎన్జీఓ మహిళా ఉద్యోగుల సమావేశం



గుంటూరు మెడికల్: గుంటూరులోని ఏపీ ఎన్జీఓ హోమ్‌లో మంగళవారం ఏపీ ఎన్జీవో జిల్లా మహిళా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. సమావేశంలో జిల్లా మహిళా విభాగం చైర్‌పర్సన్ రాధారాణి మాట్లాడుతూ మెడికల్ డిపార్ట్‌మెంట్‌లో మహిళా ఉద్యోగులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నట్లు చెప్పారు. వాటిని జిల్లా అధ్యక్షుడి దృష్టికి తీసుకువెళతామన్నారు. కన్వీనర్ లక్ష్మీరమ్య మాట్లాడుతూ మహిళా ఉద్యోగులకు కార్యాలయంలో కనీస సదుపాయాలు లేవని చెప్పారు. కొన్ని కార్యాలయాలలో నేటికీ ఉమెన్ ప్రొటెక్షన్ సెల్‌లు ఏర్పాటు చేయలేదని, వాటన్నిటి పరిష్కార దిశగా అడుగులు వేస్తామన్నారు. నూతన సంవత్సర ఏపీ ఎన్జీవో అసోసియేషన్ ఉమెన్ వింగ్ గుంటూరు జిల్లా క్యాలెండరును ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆల్ ఇండియా స్టేట్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఉమెన్ వింగ్ కన్వీనర్ ఎం.రాజ్యలక్ష్మి, రాష్ట్ర ఉమెన్ వింగ్ కన్వీనర్ పి.మాధవి, గుంటూరు జిల్లా అధ్యక్షుడు ఘంటసాల శ్రీనివాసరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాగూర్ షరీఫ్, జిల్లా జాయింట్ సెక్రటరీ ఉమెన్ కె.శివ జ్యోతి, గుంటూరు సిటీ అధ్యక్షుడు సూరి, సెక్రటరీ చింతల కళ్యాణ్ కుమార్, ప్రత్తిపాడు ప్రెసిడెంట్ అనిల్, జిల్లా ఉమెన్ వింగ్ కోశాధికారి శ్రీవాణి, కో చైర్ పర్సన్ అంజలి, కో-కన్వీనర్ శైలజ, సిటి ఉమెన్ వింగ్ చైర్‌పర్సన్ లక్ష్మీ ప్రసన్న, కన్వీనర్ విజయలక్ష్మి, జిల్లా, సిటి ఉమెన్ వింగ్ కార్యవర్గ సభ్యులు, తాలూకా ఉమెన్ వింగ్ చైర్ పర్సన్, కన్వీనర్లు తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా సాగుచేస్తున్న పంటలు ధ్వంసం

40 ఎకరాలను జేసీబీల సాయంతో దున్నేయించిన అధికారులు



శాఖమూరు(తాడికొండ): సీఆర్డీఏ పరిధిలోని శాఖమూరు గ్రామంలో పూలింగ్‌కు ఇచ్చిన భూముల్లో అక్రమంగా రైతులు సాగుచేస్తున్న పంటలను అధికారులు ఎట్టకేలకు ధ్వంసం చేశారు. గతంలో వైఎస్సార్‌సీపీ నాయకులను టార్గెట్ చేసి పత్రికల్లో కథనాలు రాయించి టీడీపీ నాయకులు కక్షతో పంటలను ధ్వంసం చేయించారు. ఈ ప్రాంతంలో పనుల్లేక పశువులను మేపుకుంటూ పశువుల మేతకోసం జొన్నసాగు చేసుకుంటున్న తమను ఇబ్బందులకు గురిచేయడంపై గ్రామస్తులు మూకుమ్మడిగా అధికారులను ప్రశ్నించారు. ఎట్టకేలకు స్పందించిన అధికారులు అక్రమంగా సాగుచేస్తున్న 40 ఎకరాల్లోని పంటలను మంగళవారం దున్నివేయించారు. మిగిలిన గ్రామాల్లో కూడా రైతులు పశుగ్రాసం కోసం పంటలు సాగు చేసుకుంటుండగా రాజధాని అభివృద్ధి పనులు పేరుతో అధికారులు వాటిని తీసేయాలని హుకుం జారీ చేస్తుండటంపై పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంటల విషయంలో పక్షపాతం వహించకుండా అందరికీ ఒకే న్యాయం జరిగేలా అధికారులు వ్యవహరించాలని కోరుతున్నారు.

మద్యానికి బానిసై యువకుడు బలవన్మరణం



కొమ్మాలపాటి సూర్య (ఫైల్)

మార్టూరు: మద్యం వ్యసనానికి బానిసైన ఓ యువకుడు మనస్థాపంతో బలవన్మరణానికి పాల్పడిన సంఘటన మార్టూరు మండలం కోలలపూడి గ్రామంలో జరిగింది. కుటుంబ సభ్యులు, ఏఎస్ఐ మహబూబ్ బాషా తెలిపిన వివరాల మేరకు కోలలపూడి ఎస్సీ కాలనీకి చెందిన కొమ్మాలపాటి దేవుని దయ కుమారుడు సూర్య (22) పదో తరగతి వరకు చదువుకొని అనంతరం మద్యానికి బానిసయ్యాడు. ఇటీవల పెళ్లి చేసుకోవడానికి ప్రయత్నించిన సూర్యకు రెండు, మూడు సంబంధాలు మద్యం అలవాటు కారణంగా వెనక్కు పోవటంతో సూర్య మనస్థాపానికి గురయ్యాడు. ఈ క్రమంలో సోమవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో సూర్య టవల్‌తో ఇంట్లోని సీలింగ్ ఫ్యాన్కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు బంధువులు సూర్యను కిందకు దించి పరిశీలించగా అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు. మంగళవారం ఉదయం సూర్య తండ్రి దేవుని దయ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ మహబూబ్ బాషా తెలిపారు.

కౌలు రైతులకు బ్యాంకు రుణాలు

లీడ్ బ్యాంక్ మేనేజర్ మహిపాల్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న లీడ్ బ్యాంక్ మేనేజర్ మహిపాల్‌రెడ్డి తదితరులు

గుంటూరు రూరల్: భూ యజమానులు రుణాలు తీసుకోకుండా ఉంటే గుర్తింపు కార్డులున్న కౌలు రైతులకు ఈ రబీలో పంట రుణాలు ఇవ్వటానికి సిద్ధంగా ఉన్నామని జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ మహిపాల్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని జొన్నలగడ్డ గ్రామంలో వ్యవసాయశాఖ, బ్యాంక్, రైతు సంఘం సంయుక్త ఆధ్వర్యంలో కౌలు రైతుల సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి మండల వ్యవసాయ అధికారి సుబ్రహ్మణ్యం అధ్యక్షత వహించగా లీడ్ బ్యాంక్ మేనేజర్ మాట్లాడుతూ భూ యజమానులు కౌలు రైతులకు సహకారం అందిస్తే బ్యాంకు రుణాలు అధిక మొత్తంలో ఇవ్వటానికి సిద్ధంగా ఉన్నామన్నారు. జిల్లాలో 40,000 మంది గుర్తింపు కార్డులు పొందితే అందులో 12 వేల మంది భూ యజమానులు రుణాలు పొందకుండా ఉన్నారని చెప్పారు. ఎటువంటి ష్యూరిటీ లేకుండా భూమి లేని కౌలు రైతులకు గ్రూపుల ద్వారా రూ.రెండు లక్షలు మంజూరు చేస్తామన్నారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి కంచుమాటి అజయ్ మాట్లాడుతూ కౌలు రైతులందరికీ రుణాలు ఇచ్చేందుకు బ్యాంకులు కృషి చేయాలని కోరారు. పలువురు కౌలు రైతులు లీడ్ బ్యాంకు మేనేజర్‌కు తమ సమస్యలు విన్నవించారు. అనంతరం లీడ్ బ్యాంకు మేనేజర్‌ను కౌలురైతులు సన్మానించారు. కార్యక్రమంలో అజయ్, ఏడీఏ శ్రీనివాసరావు, రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యుడు ఇమ్మడి రామారావు, సర్పంచ్ మబ్బు శిరీష, ఉపసర్పంచ్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

లక్ష్యం మేరకు పనిదినాలు కల్పించాలి

ఏపీడీ సువార్త



మాట్లాడుతున్న ఏపీడీ సువార్త

కర్లపాలెం: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలోని జాబ్ కార్డులు కలిగిన కూలీలకు ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాల మేరకు పనులు కల్పించాలని ఏపీడీ సువార్త చెప్పారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఫీల్డ్ అసిస్టెంట్లతో జరిగిన సమావేశానికి ఆమె హాజరయ్యారు. ఏపీడీ మాట్లాడుతూ మండల పరిధిలో ఉన్న అన్ని గ్రామ పంచాయతీలలో ఉపాధి హామీ పథకం జాబ్‌కార్డులు కలిగిన కుటుంబాలలోని వారికి 100రోజుల పనిదినాలు కల్పించేందుకు ఫీల్డ్ అసిస్టెంట్లు కృషి చేయాలన్నారు. మండలంలో మంజూరై నిర్మాణ దశలో ఉన్న మినీ గోకుల్ షెడ్ల నిర్మాణం నెలాఖరుకు పూర్తి చేయాలని ఆదేశించారు. 2025-2026 సంవత్సరంలో కూలీలకు పనులు కల్పించేందుకు కావలసిన పనులను గుర్తించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఉపాధి హామీ సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎ.శ్రీనివాసరావు, ఇన్‌చార్జ్ ఏపీవో మహేష్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

మినుము సాగులో సస్యరక్షణ పద్ధతులు తప్పనిసరి

జిల్లా వనరుల కేంద్రం సహాయ వ్యవసాయ సంచాలకులు అక్తర్ హుస్సేన్



రైతులకు సూచనలిస్తున్న జిల్లా వనరుల కేంద్రం సహాయ వ్యవసాయ సంచాలకులు అక్తర్

చెరుకుపల్లి: మినుము సాగులో రైతులు సస్యరక్షణ పద్ధతులు అవలంభించి అధిక దిగుబడులు సాధించాలని జిల్లా వనరుల కేంద్రం సహాయ వ్యవసాయ సంచాలకులు అక్తర్ హుస్సేన్ సూచించారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఆళ్లవారిపాలెం, రాజోలు గ్రామాల్లో మినుము సాగును వ్యవసాయ అధికారులు, రైతులతో కలిసి మంగళవారం పరిశీలించారు. ప్రస్తుతం మినుము సాగులో పలు రకాల తెగుళ్లు ఆశించేందుకు అవకాశం ఉంటుందన్నారు. పల్లాకు తెగులు, సీతాఫలం తెగులు, తామర తెగులు తదితర తెగుళ్లు ఆశిస్తాయన్నారు. నిరంతరం సాగును పర్యవేక్షిస్తూ వ్యవసాయ అధికారుల సూచనల మేరకు మందులు వినియోగించాలని పేర్కొన్నారు. రైతులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారి ఏ.మహేష్‌బాబు, ఏఈవోలు, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

బంగారు కమ్మలు అపహరించిన మహిళ

అద్దంకి రూరల్: జ్యూయలరీ షాపులో బంగారు కమ్మలు అపహరించిన మహిళను గుర్తించిన షాపు యజమాని పోలీస్‌స్టేషన్‌లో అప్పగించిన సంఘటన మంగళవారం అద్దంకిలో చోటుచేసుకుంది. అద్దంకి పట్టణంలోని శ్రీరామ బజారులోని హనుమాన్ జ్యూయలరీ షాపులో గుర్తు తెలియని మహిళ వచ్చి కమ్మల మోడల్స్ చూపించమని అడగటంతో అవి ఉన్న బాక్స్‌ను ఆమెకు ఇచ్చారు. అయితే అందులోని రెండు బంగారు కమ్మలను తీసుకుని వాటి స్థానంలో నకిలీ కమ్మలు పెట్టి ఇచ్చింది. ఇవేమీ వద్దు అని చెప్పి వెళ్లిపోయింది. తరువాత యజమానికి అనుమానం వచ్చి కమ్మల బాక్స్ చూడటంతో అందులో ఒక జత నకిలీవిగా గుర్తించి ఆమెను వెతికిపట్టుకున్నారు. గట్టిగా అడగటంతో తీసుకున్న కమ్మలు ఇచ్చింది. దీంతో షాపు యజమాని ఆమెను పోలీస్‌స్టేషన్‌లో అప్పగించాడు.

ఆర్థిక ఇబ్బందులతో యువకుడు ఆత్మహత్య



ఉదయ్‌కిరణ్ మృతదేహం

నరసరావుపేట రూరల్: ఆర్థిక ఇబ్బందులతో యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటనపై రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బాపట్ల జిల్లా సంతమాగులూరు మండలం కుందుర్తి గ్రామానికి చెందిన కసుపోలు ఉదయ్‌కిరణ్ (32) రెండు సంవత్సరాలుగా పట్టణంలోని 60 అడుగుల రోడ్డు సమీపంలో నివసిస్తున్నాడు. కార్ల క్రయవిక్రయ వ్యాపారం చేస్తున్నాడు. నష్టాలు రావడంతో మార్కెట్ సెంటర్‌లో కూరగాయల వ్యాపారం ప్రారంభించాడు. అప్పులు ఇచ్చిన వారి వేధింపులు ఎక్కువ కావడంతో సోమవారం రాత్రి ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు. మృతుని భార్య జయలక్ష్మి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ కిశోర్ తెలిపారు. అయితే ఉదయ్‌కిరణ్ ఆన్‌లైన్ బెట్టింగ్ వల్ల అప్పుల పాలైనట్లు ప్రచారం జరిగింది. ఇలా దాదాపు రూ.10 లక్షలు పోగొట్టుకున్నట్టు చెబుతున్నారు. కానీ ఈ ప్రచారాన్ని అతడి భార్య ఖండించారు.

యువతి ఆత్మహత్య

మాచర్ల: పట్టణంలోని పదో వార్డులో నివాసం ఉండే డిగ్రీ చదువుతున్న యువతి (20) ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... నాలుగు నెలలుగా ఆమె కడుపు నొప్పితో బాధపడుతోందని, ఆ బాధ భరించలేక మంగళవారం ఆత్మహత్యకు పాల్పడిందన్నారు. సమాచారం అందుకున్న సీఐ ప్రభాకరరావు, ఎస్సై సంధ్యారాణిలు సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. యువతి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

ఐదుగురు విశిష్ట మహిళలకు సత్కారాలు



మహిళామూర్తులను సత్కరిస్తున్న నిర్వాహకులు

నగరంపాలెం(గుంటూరు వెస్ట్): స్థానిక బృందావన్‌గార్డెన్స్ వేంకటేశ్వరస్వామి ఆలయం అన్నమయ్య కళావేదికపై పలు రంగాల్లో విశేష ప్రతిభ కనబరిచిన విశిష్ట మహిళా మూర్తులకు మంగళవారం సత్కారం జరిగింది. గుళ్లపల్లి సుబ్బారావు సేవా సంస్థ ఆధ్వర్యంలో పెద్ద సాంబశివరావు సహకారంతో ఈ కార్యక్రమం జరిగింది. గుంటుపల్లి అరుణజ్యోతి, సత్కారగ్రహీతలు జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. కుందుర్తి స్వరాజ్య పద్మజ అధ్యక్షత వహించారు. 70 వసంతాల వయస్సుపైబడి పలు రంగాల్లో నిష్ణాతులైన దేవాలయ పాలక మండలి గౌరవాధ్యక్షురాలు ఆధ్యాత్మిక సేవా శిరోమణి గద్దె రామతులశమ్మ(ఆధ్యాత్మిక), వేమూరి రామలక్ష్మి (సంగీతం), డాక్టర్ సిహెచ్ సుశీలమ్మ (సాహిత్యం), వి.ఎన్.డి.శ్యామసుందరీదేవి (విద్య), మాధవ పెద్ది మీనాక్షి (సంగీతం)లను సత్కరించారు.

తమ్ముడిపై కత్తితో దాడిచేసిన అన్న అరెస్ట్

సాక్షి వార్తా కథనంతో స్పందించిన పోలీసులు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న తాడేపల్లి సీఐ కళ్యాణ్ రాజు

తాడేపల్లిరూరల్: ప్రకాష్‌నగర్‌లో తమ్ముడిపై కత్తితో అన్న దాడిచేసినా పోలీసులు పట్టించుకోవడం లేదంటూ సాక్షిలో వచ్చిన వార్తా కథనానికి తాడేపల్లి పోలీసులు స్పందించి నిందితుడిని మంగళవారం అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరిచారు. ఈ సందర్భంగా తాడేపల్లి సీఐ కళ్యాణ్‌రాజు మాట్లాడుతూ ప్రకాష్‌నగర్‌కు చెందిన ఆరిఫ్‌ను అతని అన్నయ్య అయిన షేక్ మీరా అలియాస్ ఆసిఫ్ పాత గొడవల నేపథ్యంలో డిసెంబర్ 12న కూరగాయలు కోసే కత్తితో పొడిచాడని వివరించారు. ఆరిఫ్‌ను బంధువులు 108 వాహనం ద్వారా విజయవాడలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారని, జరిగిన ఈ ఘటనపై కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్టు చేసి కోర్టుకు హాజరు పరిచినట్లు వివరించారు.

కుప్పకూలిన లిఫ్ట్

ఐదుగురికి తీవ్రగాయాలు

తెనాలి: సామర్థ్యానికి మించి జనం ఎక్కడంతో అపార్టుమెంటు లిఫ్ట్ కుప్పకూలింది. ఈ దుర్ఘటనలో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. స్థానిక డీఎస్పీ కార్యాలయం వెనుకవైపు వీధిలో అయ్యప్పస్వామి గుడి వద్ద గ్రీన్‌లీఫ్ మినర్వా అపార్టుమెంటులో 32 వరకు ఫ్లాట్లు ఉన్నాయి. సమీపంలోని కఠెవరం గ్రామపంచాయతీ పరిధిలోకి వస్తుంది. ఐదో ఫ్లోరులోని ఒక ఫ్లాటులో నివసిస్తున్న కుటుంబం సోమవారం రాత్రి పురోహితులను పిలిపించి, తమ ఇంట్లో రుద్రపారాయణం చేయించారు. పూజా కార్యక్రమాలన్నీ పూర్తయి, రాత్రి 10 గంటల సమయంలో పురోహితులు, వారి సహచరులు అంతా కలిసి కిందకు వచ్చేందుకు సిద్ధమయ్యారు. మొత్తం 11 మంది లిఫ్ట్‌లో ఎక్కారు. ఐదు నుంచి నాలుగు, మూడో ఫ్లోరు వరకు బాగానే వచ్చిన లిఫ్ట్, అక్కణ్నుంచి ఒక్కసారిగా కుప్పకూలింది. కింద ఉండే స్ప్రింగులపై పడి పైకిలేచి మళ్లీ పడిపోయిందని అక్కడ నివసిస్తున్నవారు తెలిపారు. దీంతో లిఫ్టులోని వారంతా ఒకరిపై ఒకరు పడిపోయారు. అందులో అయిదుగురు తీవ్రంగా గాయపడ్డారు. 108 అంబులెన్స్ వాహనంలో వీరిని స్థానికంగా గల ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చేర్చారు. వాస్తవానికి లిఫ్ట్ సామర్థ్యం ఆరుగురేనని చెబుతున్నారు. దాదాపు రెట్టింపు జనాభా ఎక్కడంతో లిఫ్టుకుండే వైరు తెగి ప్రమాదం జరిగిందని చెబుతున్నారు. దీనిపై బాధితులను వివరాల కోసం సంప్రదించగా, పత్రికలో రాయొద్దని కోరారు.